సాక్షి
శ్రీకాకుళం
మంగళవారం । 22 । ఏప్రిల్ । 2025



విన్నపాలు విన్నారు

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జనం సమస్యలు ఏకరువు పెట్టారు. ఆక్రమణలపై ఫిర్యాదులు చేశారు.

- 8లో



పరిమితి పెరిగిందోచ్

రైతులకు స్కేల్‌ఆఫ్ ఫైనాన్స్ పెరిగింది. బ్యాంకర్లకు కూడా సమాచారం వెళ్లింది.

- 8లో

నిత్యావసరాలు అందకపోవడంపై విచారణ

మెళియాపుట్టి: మండలంలోని బాణపురం పంచాయతీ పరిధిలోని పదనాపురం గ్రామంలో పలువురికి రేషన్ సరుకులు అందలేదని రెవెన్యూ అధికారులకు సమాచారం అందింది. దీనిపై తహసీల్దార్ పాపారావు సోమవారం ఆరా తీశారు. రేషన్ పంపిణీలో జరిగిన లోపాలను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

న్యూస్‌రీల్

జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాధికారిగా సురేష్‌కుమార్ నియామకం

శ్రీకాకుళం అర్బన్: జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాధికారి(డీఐఈఓ)గా ఆర్.సురేష్‌కుమార్ నియామకం అయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు వెలువరించింది. విజయనగరం జిల్లా గుర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న ఈయనను తాత్కాలిక డీఐఈఓగా నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటి వరకూ శ్రీకాకుళం జిల్లా డీవీఈఓగా పనిచేసిన శివ్వాల తవిటి నాయుడును విజయనగరం జిల్లా డీఐఈఓగా బదిలీ చేస్తూ ఉత్తర్వులు వెలువరించారు. తవిటినాయుడు పాలకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేస్తూ జిల్లా డీవీఈఓగా సేవలందించిన విషయం తెలిసిందే.

ఉపాధిలో ఖాళీలకు కొత్త అభ్యర్థులకే అవకాశం

శ్రీకాకుళం పాతబస్టాండ్: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో గ్రామ పంచాయతీ స్థాయిలో ఖాళీగా ఉన్న క్షేత్ర సహాయకులు, సీనియర్ మేట్ల పోస్టులు భర్తీ చేయనున్నట్టు డ్వామా పీడీ సుధాకర్ రావు తెలిపారు. ఖాళీల భర్తీకి కొత్త అభ్యర్థుల వివరాలను మాత్రమే పంపాలని మండల అభివృద్ధి అధికారులకు తెలిపారు. మేట్ల మధ్య తగాదాలు, పని వేళల్లో గైర్హాజరీ వంటి సమస్యలను మండల పరిషత్ అభివృద్ధి అధికారులు పరిష్కరించాలని సూచించారు.

ప్రభుత్వ పాఠశాలలో ఎంఈఓ పిల్లలు



కొత్తూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నూతనంగా చేరిన పిల్లలతో పాటు ఎంఈఓలు, హెచ్‌ఎం గోవిందరావు

కొత్తూరు: కొత్తూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్థానిక ఎంఈఓ ఎస్.శ్రీనివాసరావు కుమార్తెను ఆరో తరగతిలో చేర్చారు. ప్రవేశ పత్రంను హెచ్‌ఎం గోవిందరావు అందజేసి జాయిన్ చేసుకున్నారు. ఇప్పటికే ఎంఈఓ కుమారుడిని సైతం ప్రభుత్వ బడిలోనే చేర్పించారు. ప్రభుత్వ బడుల్లో నైతిక విలువలతో పాటు నాణ్యమైన విద్య అందుతోందని, అందుకే పిల్లలను ప్రభుత్వ బడిలో చేర్పించానని ఎంఈఓ శ్రీనివాసరావు తెలిపారు. పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని హెచ్‌ఎంతో పాటు సిబ్బంది ప్రచారం చేశారు.

ఇసుక మేటల తొలగింపు ప్రారంభం

ఎచ్చెర్ల క్యాంపస్: నారాయణపురం ప్రాజెక్టు పరిధిలో ఇసుక మేటలు తొలగించే పనులు సోమవారం ప్రారంభించారు. నారాయణపురం కుడి కాలువ ద్వారా ఎచ్చెర్ల మండలంలో 13 పంచాయతీల పరిధిలో 7175 ఎకరాకు సాగునీరు అందుతుంది. గత ఏడాది సాగునీటి సమస్య కాణంగా పంటలు ఎండిపోయాయి. ఈ నేపథ్యంలో రైతులు అధికారులు, ప్రజా ప్రతినిధుల దృష్టికి సమస్య తీసుకువెళ్లారు. దీంతో ఖరీఫ్ సాగునీటి లక్ష్యంగా యంత్రాలతో పనులు ప్రారంభించారు.

పశువుల అక్రమ రవాణా అడ్డగింత



వ్యాన్‌లో తరలిస్తున్న పశువులు

ఎచ్చెర్ల: లావేరు మండలంలోని బుడుమూరు జాతీయ రహదారిపై అక్రమంగా తరలిస్తున్న పశువులను లావేరు హెచ్‌సీ రామారావు సోమవారం పట్టుకున్నారు. బుడుమూరు సంత నుంచి రణస్థలం వైపు వెళ్తున్న బొలెరో వ్యానులో ఈ పశువులను తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఆయన తెలిపారు. వ్యాన్‌లో తొమ్మిది ఆవులు, మరో వ్యానులో ఏడు ఆవులు ఉన్నట్లు పేర్కొన్నారు. విజయనగరం జిల్లా, గుర్ల మండలం, గుజ్జంగివలసకు చెందిన దేవ రమేష్, ఎచ్చెర్ల మండలం రుప్పపేట గ్రామానికి చెందిన రుప్ప వెంకటరమణ, జలుమూరు మండలానికి చెందిన వాన జడ్డన్న, టెక్కలి గ్రామానికి చెందిన ఇప్పిలి రాములపై కేసు నమోదు చేశామని తెలిపారు. పశువుల అక్రమ రవాణా నేరమని, చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

ఇసుకాసురుల విధ్వంస కేళీ
దీవిలా నాగావళి

ఈ ఫొటో చూస్తే మాల్దీవులో.. మరేవో దీవులు అనుకునేరు. ఇసుక దొంగల విధ్వంసానికి దీవిలా మారిపోయిన నాగావళి నది ఇది. ఆమదాలవలస నియోజకవర్గంలో కొనసాగుతున్న ఇసుక దోపిడీతో పెద్ద పెద్ద గోతులతో నదీ గర్భం మిగిలిపోయింది. అయినా అధికారులకు ఇదేమీ కనిపించడం లేదు. ఇప్పటికే ప్రోత్సహించిన అక్రమాలు చాలవని కాఖండ్యాం, పురుషోత్తపురం, ముద్దాడపేడ తదితర ప్రాంతాల్లో అనుమతుల విషయంలో ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు. ఇంత దారుణంగా నాగావళి నదిని కబళిస్తుంటే అధికార యంత్రాంగం పట్టించుకోవడం లేదు.





నాగావళిలో జేసీబీతో ఇసుకను తవ్వేసి తరలిస్తూ..

- ఆమదాలవలస నియోజకవర్గంలో టీడీపీ నాయకుల బరితెగింపు
- భయంకరంగా తయారవుతున్న నాగావళి నది
- వంశధారలోనూ అదే పరిస్థితి
- నిర్వాహకుల చేతుల్లోకి సాఫ్ట్‌వేర్, డివైజ్‌లు
- చోద్యం చూస్తున్న అధికార యంత్రాంగం

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

ఆమదాలవలస నియోజకవర్గంలో కాఖండ్యాం, పురుషోత్తపురం 1, 2, ముద్దాడపేట, సింగూరు, దూసి తదితర ప్రాంతాల్లో ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణా ఆగడం లేదు. కొన్నింటికి అనుమతుల ఇచ్చే విషయంలో యంత్రాంగం చోద్యం చూస్తోంది. నదులు ఏమైనా ఫర్వాలేదు తీర ప్రాంత గ్రామాలు ఏమైపోయినా అక్కర్లేదు అన్నట్టుగా వ్యవహరిస్తున్నారు. అసలు వేటికి అనుమతులున్నాయో? వేటికి అనుమతుల్లేవో? తెలియని పరిస్థితి కూడా ఉంది. నది పొడవునా తవ్వకాలు జరుగుతుండటంతో అయోమయం నెలకొంది. ఆమదాలవలస నియోజకవర్గ పరిధిలోని నాగావళిలో రాత్రి, పగలు తేడా లేకుండా జరుగుతున్న అక్రమ తవ్వకాలు, తరలింపు చూస్తుంటే భవిష్యత్‌లో ఎలాంటి ముప్పు వాటిల్లుతోందన్న భయం సర్వత్రా నెలకొంది.

తవ్వకాలు జరపడమే కాకుండా ఆ ఇసుకను కొత్త రోడ్డు పాత బంకు దగ్గర, దూసి జంక్షన్ దగ్గరలో



దూసి జంక్షన్‌లో నిర్వహిస్తున్న స్టాక్ పాయింట్‌లో రాత్రిపూట ఇసుక లోడింగ్ చేసి, రవాణా చేస్తున్న దృశ్యం

స్టాక్ పాయింట్‌గా డంపింగ్ చేసి, అక్కడి నుంచే లోడింగ్ చేసి విక్రయాలు సాగిస్తున్నారు. బాలకృష్ణ, రవికాంత్ తదితర వ్యక్తుల కనుసన్నల్లోనే అక్రమ దందా సాగుతోంది. అధికారుల వద్ద ఉండాల్సిన బిల్లుల సాఫ్ట్‌వేర్, డివైజ్‌లు నేరుగా నిర్వాహకుల చేతుల్లోకి వెళ్లాయి. రీచ్ నిర్వాహకులే స్వయంగా బిల్లులు రూపొందించి, లారీ డ్రైవర్లకు అందజేస్తున్నారు. దీంతో రోజుకి ఎన్ని బిల్లులు ఇస్తున్నారో, ఎంత తరలిస్తున్నారో కూడా కూడా లెక్క తెలియని దుస్థితి నెలకొంది. ఇదే విషయమై ఎమ్మెల్యే కూన రవికుమార్ అండ్ కో నిర్వాకాలపై పోరాటం చేస్తున్న సనపల సురేష్ అనే వ్యక్తి ఇప్పటికే అధికారులకు ఫిర్యాదు కూడా చేశారు. అయినప్పటికీ స్పందన లేదు. అక్రమాలు ఆగడం లేదు. ఇసుక తవ్వకాలు, తరలింపునకు బ్రేక్ పడటం లేదు. ప్రతి రోజూ వేలాది లారీల ఇసుక అక్రమంగా తరలిపోతోంది. కోట్లాది రూపాయల మేర నిర్వాహకులు సంపాదిస్తున్నారు.

ఫిర్యాదు చేశా..



ఆమదాలవలస నియోజకవర్గంలో టీడీపీ నాయకులు ఇసుక మాఫియాగా తయారై ఇసుక దోపిడీకి పాల్పడుతున్నారు. వారిపై చర్యలు తీసుకోవాలని అధికారులకు ఫిర్యాదు చేశాను.

– చింతాడ రవికుమార్, వైఎస్సార్ సీపీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త

అపచారంపై భగ్గుమన్న భక్తజనం

- శ్రీకూర్మంకు పరుగులెత్తిన అధికార గణం
- బట్టబయలైన 'గ్రీన్‌మెర్సీ' నిర్లక్ష్య వైఖరి
- పొంతనలేని లెక్కలు.. నిజాన్ని దాచే ప్రయత్నాలు
- పత్రికా కథనాలపై కలెక్టర్ ఆదేశాలతో రంగంలోకి అధికారులు
- బైఠాయించి నిరసన వ్యక్తం చేసిన భక్తులు, వీహెచ్‌పీ సభ్యులు
- పర్యవేక్షణలో డొల్లతనంపై స్థానిక ఎమ్మెల్యే సీరియస్

శ్రీకూర్మంలో ఘోరం

గార:

వేల ఏళ్లుగా శ్రీకూర్మంలో విరాజిల్లుతున్న కూర్మనాథ క్షేత్రం సాక్షిగా అపురూప నక్షత్ర తాబేళ్ల సంరక్షణపై నిర్లక్ష్యపు నీడ కమ్ముకుంటోంది. సాక్షాత్తు ఆ దేవుడి ఎదుటే కూర్మాల ఆయుష్షు తగ్గిపోతోంది. ఈ వైఖరి భక్తుల మనసు తీవ్రంగా కలిచివేస్తోంది. తాబేళ్ల మరణ మృదంగంపై వచ్చిన వార్తలు చూసిన కూర్మనాథుని భక్తులు ఆలయ నిర్వాహకులతో పాటు తాబేళ్ల పార్కు నిర్వాహకులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పొంతన లేకుండా సమాధానం చెబుతున్న తీరుపై మండిపడ్డారు. కళ్ల ముందు అంతా కనిపిస్తుంటే కప్పి పుచ్చడానికి ప్రయత్నాలు చేస్తుండడాన్ని ఖండిస్తున్నారు. స్థానికులతో పాటు భక్తులు, వీహెచ్‌పీ సభ్యులు, రాజకీయ నాయకులు అంతా సోమవారం కూర్మనాథ క్షేత్రానికి క్యూ కట్టారు.

అంతా హడావుడే.. తేలని లెక్క

కూర్మనాథాలయంలో తాబేళ్ల మృత్యుఘోష.. దహనంపై వివిధ విభాగాల అధికారులు ఆలయాన్ని సందర్శించారు. ఘటనపై ఆరా తీశారు. కానీ పార్కులో ఉన్న తాబేళ్ల సంఖ్య ఎంత.. ప్రస్తుతం ఎన్ని ఉన్నాయి.. అనే అంశంపై మాత్రం ఎవరూ దృష్టిసారించిన దాఖలాలు లేవు. తాబేళ్ల పార్కు నిర్వహణ బాధ్యతలు చూసుకునే గ్రీన్‌మెర్సీ సంస్థ నిర్వాహకుడు మాత్రం 212 ఉండాలని, రికార్డు



ప్రకారం అంతే ఉన్నాయని చెప్పడం విశేషం. స్థానిక ఎమ్మెల్యే గొండు శంకర్ రికార్డుల నిర్వహణపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పర్యవేక్షణ అధికారి సంతకాలు లేకపోవడాన్ని ప్రశ్నించారు.

25 ఎక్కడ నుంచి వచ్చాయో..

కూర్మనాథాలయం ఈవో కార్యాలయం వెనక భాగంలో దహనం చేసిన.. కళేబరాలుగా ఉన్న తాబేళ్ల సంఖ్య 25గా అధికారులు గుర్తించారు. వాటిలో 8 తాబేళ్లను పోస్టుమార్టం కోసం పంపించారు. పార్కులో మొత్తం తాబేళ్ల సంఖ్య 212 ఉండాలని.. రికార్డుల ప్రకారం సరిపోయాయని.. గ్రీన్ మెర్సీ మూర్తి సమాధానం ఇవ్వడం వెనక ఆంతర్యమేమిటని భక్తులు మండిపడుతున్నారు. మరి లెక్క సరిపోతే మరణించిన తాబేళ్లు ఎక్కడ్నుంచి వచ్చాయని.. ప్రశ్నిస్తున్నారు.

అడ్డుకట్ట వేయాలి



తాబేళ్ల పార్కు రికార్డులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గొండు శంకర్

పురాతనమైన కూర్మక్షేత్రంలో స్వామి ప్రతిరూపంగా భావిస్తున్న తాబేళ్ల మృతికి అడ్డుకట్ట వేయాలని గార మండల ఎంపీపీ గొండు రఘురాం, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పీస గోపి, పార్టీ యువజన విభాగం అధ్యక్షుడు మార్పు దుర్గా పృథ్వీరాజ్ డిమాండ్ చేశారు. భక్తుల మనోభావాలను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. తాబేళ్లను దేవాలయంలో ఉంచుతూనే రక్షణ చర్యలు పటిష్టం చేయాలని కోరారు.

చనిపోతుంటే నేనే బయటకు వేస్తున్నా..



ఏమైందో ఏమో తెలియదు. పార్కులో ఈ మధ్య కాలంలో రోజుకి ఒకటో రెండో తాబేళ్లు చనిపోతుంటే నేనే ఈఓ కార్యాలయం వెనక ప్రహరీ వైపు వేసేస్తున్నా. ఇదే విషయాన్ని మా యజమాని మూర్తి (గ్రీన్‌మెర్సీ)కి తెలియపరుస్తున్నా. కలెక్టర్ దృష్టికి తీసుకువెళతానని సమాధానమిచ్చారు.

– దానమ్మ, కూర్మనాథాలయంలోని తాబేళ్ల పార్కు సంరక్షకురాలు

విరాళాల సేకరణేనా.. మృత్యుఘోష వినపడలేదా..



ఆలయానికి వచ్చే భక్తులకు తాబేళ్ల కోసం వివరించడం.. వాటి పరిరక్షణకు విరాళాలు సేకరించడం చేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి నాగేంద్రపై కూడా సోమవారం భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ఎంత సేపు దృష్టంతా విరాళాల సేకరణపైనేనా.. తాబేళ్లు మృత్యువాత పడుతుంటే మీకు పట్టలేదా' అంటూ నాగేంద్రను నిలదీశారు. ఇలా ఎన్నాళ్లుగా జరుగుతోందని.. ఎన్ని తాబేళ్లు మరణించి ఉంటాయో చెప్పాలని ఆయన్ని ప్రశ్నించారు.



విశ్వహిందూ పరిషత్ సభ్యుల నిరసన

● కూర్మనాథాలయంలో విదేశీ భక్తులు



ఆదికూర్మక్షేత్రం శ్రీకూర్మనాథాలయంలో స్వామిని విదేశాలకు చెందిన ఎనిమిది మంది భక్తులు సోమవారం దర్శించుకున్నారు. ఇస్కాన్ సంస్థకు చెందిన వీరంతా దర్శనాలు పూర్తి చేసుకున్న అనంతరం ఆలయంతో పాటు శ్వేతపుష్కరిణి గట్టు వెంబడి హరేరామ, హరేకృష్ణ అంటూ భక్తిగీతాలతో భజనలు చేస్తూనే నాట్యం చేశారు. కొందరు హిందూ భక్తులు కూడా వీరితో కలిశారు. –గార

పీజీ నాలుగో సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం, అఫిలియేషన్ పరిధిలోని పోస్టు గ్రాడ్యుయేషన్ నాలుగో సెమిస్టర్ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. వర్సిటీ పరీక్ష కేంద్రంలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ పరీక్షలు ఈ నెల 29వ తేదీ వరకు నిర్వహించనున్నారు. మొదటి రోజు సైన్స్ కోర్సుల్లో 351 మందికి 347, ఆర్ట్స్ కోర్సుల్లో 159 మందికి 153 మంది హాజరయ్యారు. వర్సిటీ అధికారులు పరీక్షలు పర్యవేక్షించారు.



పరీక్ష రాస్తున్న విద్యార్థులు

వైఎస్సార్ విగ్రహం ధ్వంసం

- శ్రీకాకుళం మండల పరిధిలో బైరి గ్రామంలో ఘటన
- ముక్తకంఠంతో ఖండించిన వైఎస్సార్‌సీపీ నాయకులు
- దోషులను పట్టుకుని కఠినంగా శిక్షించాలని డిమాండ్



వైఎస్సార్ విగ్రహాన్ని ధ్వంసం చేసి రోడ్డుకు అడ్డంగా పడేసిన దృశ్యం

శ్రీకాకుళం రూరల్:

శ్రీకాకుళం మండల పరిధిలోని బైరి గ్రామం ముఖద్వారం వద్ద ఏర్పాటు చేసిన దివంగత నేత వైఎస్ రాజశేఖర రెడ్డి విగ్రహాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ఆదివారం అర్ధరాత్రి తర్వాత పగులగొట్టి రోడ్డుకు అడ్డంగా పడేశారు. జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న సర్వీసు రోడ్డులో బైరి గ్రామానికి వెళ్లే రహదారిలో ఈ విగ్రహాన్ని వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక గత కొన్ని నెలల కిందట విగ్రహం ఎడమ చేతిని కూడా గుర్తు తెలియని వారు ధ్వంసం చేశారు. ఇప్పుడు ఏకంగా విగ్రహాన్నే కూల్చేశారు. దీనిపై బైరి గ్రామానికి చెందిన ఉప సర్పంచ్ ఎండి అసిరినాయుడుతో పాటు పలువురు గ్రామస్తులు రూరల్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సంఘటనను వైఎస్సార్‌సీపీ నాయకులంతా ముక్తకంఠంతో ఖండించారు. జనం గుండెల్లో సుస్థిర స్థానం పొందిన వైఎస్సార్ విగ్రహంపై ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడడం సరికాదని అన్నారు. దోషులను పట్టుకుని కఠినంగా శిక్షించాలని కోరారు.


విగ్రహం కూల్చివేత పైశాచికం



బైరి జంక్షన్ వద్ద వైఎస్సార్ విగ్రహాన్ని కూల్చేయడం పైశాచికం. ఈ ఘటనకు పాల్పడిన వ్యక్తులను గుర్తించి, చట్టపరంగా శిక్షించాలి. 108, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి పథకాలతో వైఎస్సార్ పేరు చిరస్థాయిగా నిలిచిపోయింది. పార్టీలకు అతీతంగా కోట్లాది మంది మదిలో ఆయన శాశ్వత స్థానం ఏర్పరచుకున్నారు. అలాంటి మహోన్నత వ్యక్తి విగ్రహాన్ని నేలపాలు చేయటం బాధాకరం. రాజకీయ పార్టీలు ఇలాంటి అనైతిక చర్యలను ముక్తకంఠంతో ఖండించాలి.

– తమ్మినేని సీతారాం, వైఎస్సార్ సీపీ రాజకీయ వ్యవహారాల కమిటీ సభ్యుడు

విగ్రహ ధ్వంసం దుర్మార్గ చర్య



బైరి గ్రామంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహాన్ని ధ్వంసం చేయడం దుర్మార్గం. ఈ ఘటనకు పాల్పడినవారిపై త్వరితగతిన విచారణ జరిపి బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలి. దీనిపై కలెక్టర్ చొరవ తీసుకోవాలి. వైఎస్సార్ పాలనలోనే రాష్ట్రంలో ప్రజలంతా సుభిక్షంగా ఉన్నారు. వైఎస్సార్ రాష్ట్రానికి చేసిన సేవలను మరిచిపోలేనివి. అలాంటి వ్యక్తి విగ్రహాన్ని కూల్చివేయడం వెనుక పెద్ద కుట్ర దాగి ఉంటుంది. విజ్ఞత గల వారు ఇలాంటి పనుల చేయరు. ప్రభుత్వానికి చేతనైతే ప్రజలకిచ్చిన హామీలు నెరవేర్చాలే తప్ప ఇలాంటివి ప్రోత్సహించకూడదు.

– ధర్మాన కృష్ణదాస్, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు

సరికాదు



వైఎస్సార్ విగ్రహాన్ని కూల్చివేయడం సరికాదు. తక్షణమే ఎస్పీ, కలెక్టర్లు స్పందించి ఈ ఘటనకు పాల్పడిన వారిని శిక్షించాలి. జిల్లా నాయకులతో మాట్లాడి మళ్లీ కొత్త విగ్రహం ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటాం.

– ఎంవీ స్వరూప్, వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర జిల్లాల యువజన అధ్యక్షుడు

దోషులను కఠినంగా శిక్షించాలి



బైరిలో వైఎస్సార్ విగ్రహాన్ని కూల్చేసిన ఘటనలో దోషులను కఠినంగా శిక్షించాలి. రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు అందరి సంక్షేమం కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేశారు. అందరి గుండెల్లో ఆయన చిరంజీవిగా నిలిచి ఉంటారు. అలాంటి వారి మనోభావాలను దెబ్బతీసేందుకు ఇలాంటి సంఘటనలకు పాల్పడుతున్నారు. జిల్లాలో శాంతి భద్రతలకు నష్టం కలిగించేలా ప్రవర్తిస్తున్న వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలి.

– రెడ్డి శాంతి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు

వైఎస్ స్థానాన్ని ఏమీ చేయలేరు



వైఎస్సార్, ఆయన తనయుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పేద ప్రజల గుండెల్లో స్థానం సంపాదించుకున్నారు. వైఎస్ విగ్రహాన్ని కూల్చివేయగలరేమో గానీ జనం గుండెల్లో వైఎస్సార్ స్థానాన్ని ఏమీ చేయలేరు. కూటమి నేతలకు దమ్ముంటే ప్రజలకిచ్చిన హామీలు అమలుచేయాలి. అబద్ధపు హామీలిచ్చి అధికారం అందుకుని, రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తూ రాష్ట్రాన్ని రావణకాష్టంగా మార్చేస్తున్నారు.

– దుంపల లక్ష్మణరావు, వైఎస్సార్‌సీపీ కాళింగ కుల విభాగ రాష్ట్ర అధ్యక్షుడు

క్లుప్తంగా

25న టేకు కలప బహిరంగ వేలం

టెక్కలి: ఈ నెల 25న టెక్కలి కోర్టు సముదాయంలో టేకు కలప బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు కోర్టు వర్గాలు సోమవారం ఓ ప్రకటనలో తెలిపాయి. వివిధ కేసుల్లో పట్టుబడిన సుమారు రూ.47,872 (ప్రభుత్వ విలువ) విలువ కలిగిన 21 రకాల వివిధ సైజులు కలిగిన టేకును బహిరంగ వేలం వేస్తున్నట్లు వెల్లడించారు. జూనియర్ సివిల్ జడ్జి ఎస్‌హెచ్‌ఆర్ తేజ చక్రవర్తి మల్ల సమక్షంలో ఉదయం 10:30 గంటల నుంచి నిర్వహిస్తున్న ఈ వేలంలో ఆసక్తి కలిగిన వారు పాల్గొనవచ్చునని పేర్కొన్నారు.

12 మందికి శ్రీశ్రీ వేదిక పురస్కారాలు

శ్రీకాకుళం కల్చరల్: సాహిత్య, కళా రంగాల్లో పలు రికార్డులు సాధించిన 12 మందికి శ్రీశ్రీ కళావేదిక సంస్థ ఆధ్వర్యంలో ఏలూరులో నిర్వహించబోయే ప్రపంచ తెలుగు సంబరాల్లో శ్రీశ్రీ వేదిక పురస్కారాలను అందిస్తున్నారు. మే నెల 10,11 తేదీల్లో నిర్వహించే ఈ సంబరాలకు జిల్లా నుంచి 12మందిని ఎంపిక చేసినట్లు నిర్వాహక సంస్థ సమన్వయకర్త ఈవేమన ఓ ప్రకటనలో తెలిపారు. జంధ్యాల శరత్ బాబు (తెలుగు భాష), కుమారనాయక్, ఎం.శ్రీరాములు (తెలుగు కీర్తి), రఘుపాత్రుని శివ, పి. ముకుందరావు (యువకీర్తి), గౌరీపతిశాస్త్రి (అక్షర తేజం), జె.వి.తిరుమలాచార్యులు (కళా కిరీటి), మహ్మద్ రఫీ (కళారత్న), మూల తాతయ్య (శ్రీశ్రీ ప్రతిభా పురస్కారం), మాతృదేవో భవ పురస్కారాలను బోడవరపు వెంకటలక్ష్మీ, గంపా శ్రీదేవి, డాక్టర్ పెన్నేటి స్వప్న హైందవిలకు ప్రకటించారని తెలిపారు.

26న ముఖ్యమంత్రి పర్యటన



స్థలం పరిశీలిస్తున్న కలెక్టర్ స్వప్నిక్ దినకర్ పుండ్కర్, ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి, అధికారులు, ఎమ్మెల్యే ఈశ్వరరావు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండలంలోని బుడగుట్లపాలెం మత్స్యకార గ్రామంలో ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు ఈ నెల 26న పర్యటించనున్నారు. ఈ సందర్భంగా బహిరంగ సభ నిర్వహించి మత్స్యకార భరోసా (వేట నిషేధ భృతి) అందజేయనున్నారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ స్వప్నిక్ దినకర్ పుండ్కర్, ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి, స్థానిక ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, ఆర్డీఓ సాయిప్రత్యూష, డీఎస్పీ వివేకానంద, తహసీల్దార్ బి.గోపాలరావుతో కూడిన అధికారులు సోమవారం ఏర్పాట్లపై సమీక్షించారు. స్థలం పరిశీలించి సభ ఏర్పాటుపై చర్చించారు.

రెండు గంటల నిరీక్షణ



కాశీబుగ్గ గేటు ముందు నిరీక్షిస్తున్న ప్రయాణికులు, బారులు తీరిన వాహనాలు

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో ఉన్న కాశీబుగ్గ ఎల్‌సీ గేటు వద్ద ప్రయాణికులు సోమవారం నరకయాతన పడ్డారు. రైలు పట్టాల కింద కొత్త స్లీపర్‌లు వేశారు. దీని కోసం ప్రత్యేకమైన రైలు రావడంతో సాయంత్రం ఐదున్నర గంటల నుంచి ఏడున్నర గంటల వరకు పనులు చేపట్టారు. ముందస్తు సమాచారం ఇవ్వకపోవడంతో వాహనదారులు అంత సేపూ వేచి ఉండాల్సి వచ్చింది. ఆఖరుకు నర్సిపురం, కిష్టుపురం ప్రాంతాల మీదుగా ప్రయాణించారు.

బైక్ ఢీకొని వ్యక్తికి గాయాలు



ఆస్పత్రిలో గాయాలతో దేవరాజు

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో ఉన్న కేటీ రోడ్డు మోర్ స్టోర్ వద్ద రోడ్డు ప్రమాదం జరిగింది. యు టర్న్ తీసుకునే సమయంలో రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొట్టడంతో చిత్రాడ దేవరాజు అనే వ్యక్తికి గాయాలయ్యాయి. తక్షణమే స్థానికులు 108 ప్రభుత్వ వాహనానికి సమాచారం ఇవ్వడంతో క్షతగాత్రుడిని పలాస ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి తరలించి వైద్య సేవలు అందించారు.

డీఎస్పీ మూర్తికి సత్కారం



రిటైరైన డీఎస్పీని సత్కరిస్తున్న ఎస్పీ

శ్రీకాకుళం క్రైమ్: విధి నిర్వహణలో అందించిన సేవలే గుర్తింపునిస్తాయని, అలాంటి క్రమశిక్షణ నిబద్ధత గల అధికారి డీఎస్పి డిఎస్ఆర్‌వీ ఎస్ఎన్ మూర్తి అని ఎస్పీ కేవీ మహేశ్వర్ రెడ్డి అన్నారు. టెక్కలిలో ఇటీవల ఉద్యోగ విరమణ పొందిన మూర్తిని నగరంలోని ఓ హోటల్‌లో సోమవారం ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ లు కేవీ రమణ, పి.శ్రీనివాసరావు, డీఎస్పీలు సీహెచ్ వివేకానంద, వీవీ అప్పారావు, శేషాద్రి పాల్గొన్నారు.

విన్నపాలు విన్నారు

- మీకోసంకు 154 దరఖాస్తులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా కేంద్రంలోని జెడ్పీ సమావేశ మందిరంలో సోమవారం జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ‘మీ కోసం’ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రత్యేక ఉప కలెక్టర్ పద్మావతి, జిల్లా పరిషత్ సీఈవో శ్రీధర్ రాజా తదితర అధికారులు పాల్గొన్నారు. ప్రజల నుంచి మొత్తం 154 దరఖాస్తులు స్వీకరించిన అధికారులు, వాటిలో కొన్ని సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. మిగిలిన అంశాలను సంబంధిత శాఖలకు పంపించి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.



పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేస్తున్న సైరిగాం గ్రామం రైతులు

సైరిగాంలో ప్రభుత్వ చెరువుల ఆక్రమణలు



సైరిగాంలో అచ్చెప్ప కోనేరులో యంత్రాలతో మట్టి వేసి కప్పుతున్న చిత్రాలు

టాస్క్ ఫోర్స్: సైరిగాం గ్రామంలో ప్రభుత్వ చెరువులు ఆక్రమణలకు గురువుతున్నాయి. గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు ముద్దాడ శ్రీనివాసరావు ఈ ఆక్రమణలు చేస్తున్నాడని గ్రామ సర్పంచ్ ధర్మాన అనితతోపాటు వైఎస్సార్‌సీపీ నాయకులు ధర్మాన వెంకటరమణ మూర్తి, పొన్నాన ముసలినాయుడు, కొర్ను నారాయణరావు తదితరులు సోమవారం ప్రభుత్వ కార్యదర్శితోపాటు డీఆర్‌ఓకు ఫిర్యాదు చేశారు. సైరిగాం పంచాయతీలో ఊరిగుండం చెరువులో సర్వే నంబరు 90లో 7.24 ఎకరాలు ఉండగా ఇందులో పలువురు రైతులకు డీ పట్టాలు ఇచ్చారు. ఇదే చెరువులో మట్టిని యంత్రాలతో తవ్వకాలు జరిపి ట్రిప్పర్లు, ట్రాక్టర్లతో మట్టిని పెరిగించి ప్రభుత్వ ఆస్పత్రికి ఎదురుగా ఉన్న అచ్చెప్ప చెరువును కప్పుతున్నారని వారు పేర్కొన్నారు. తన సోదరుడు ముద్దాడ రవి చంద్ర సీఎం కార్యాలయంలో ముఖ్య హోదాలో పని చేయడంతో ఆయన పేరు చెప్పి ఈ ఆక్రమణలకు పాల్పడుతున్నారని గ్రామస్తులు చెబుతున్నారు. కాగా ఇదే విధంగా పాపమ్మ కోనేరు, భూసమ్మకోనేరు, శోభనాద్రి చెరువు, ఉప్పరవాని చెరువు, మంగళివాని చెరువు, గాది బంద చెరువు తదితరవి దురాక్రమణ చేస్తున్నారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇదే విషయమై స్థానిక తహసీల్దార్‌కు రెండు రోజుల కిందట ఫిర్యాదు చేస్తే.. రెండు రోజులాగి మళ్లీ ఆక్రమణలు కొనసాగిస్తున్నారని తెలిపారు.

79 ఫిర్యాదుల స్వీకరణ

శ్రీకాకుళం క్రైమ్: సోమవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల స్వీకరణకు 79 ఫిర్యాదులు అందాయి. ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి ఆదేశాలతో అదనపు ఎస్పీ (అడ్మిన్) కేవీ రమణ ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. వ్యక్తిగతంగా మాట్లాడి, సమస్యలు తెలుసుకొని పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామని భరోసా కల్పించారు. ఫిర్యాదుదారుల అర్జీలు, వారి వివరాలు సంబంధిత పోలీసు అధికారులు ఫోన్ కాల్స్ ద్వారా తక్షణమే తెలియపరచి చట్ట ప్రకారం చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు.



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న అదనపు ఎస్పీ కేవీ రమణ

110 గ్రామాల్లో నాటుసారా ప్రభావం

టెక్కలి: జిల్లాలో 6 ఎక్సైజ్ కార్యాలయాల పరిధిలో 110 గ్రామాల్లో నాటు సారా ప్రభావం ఉన్నట్లు గుర్తించామని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏసీ పి.రామచంద్రరావు వెల్లడించారు. సోమవారం టెక్కలి ఎక్సైజ్ స్టేషన్‌లో తనిఖీలు నిర్వహించి విలేకర్లతో మాట్లాడారు. కొత్తూరు, హిరమండలం, నందిగాం, మెళియాపుట్టి, పలాస, మందస, సోంపేట, కంచిలి, కవిటి, ఇచ్ఛాపురం తదితర మండలాల్లో నాటుసారా ప్రభావం ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. అత్యధికంగా సోంపేట, టెక్కలి ఎక్సైజ్ స్టేషన్‌ల పరిధిలో గల మండలాల్లో 70 గ్రామాల్లో నాటు సారా ప్రభావం ఉందన్నారు. జూన్ నాటికి సారా రహిత జిల్లాగా మార్చేందుకు ప్రత్యేకంగా నవోదయం కార్యక్రమంతో ఇప్పటికే 190 అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు ఏసీ పేర్కొన్నారు. గతంలో నాటుసారా అమ్మకాలు చేసిన 1224 మందిని గుర్తించి వారిలో 724 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు. నాటు సారా తయారీ, విక్రయాలను మానేస్తే అలాంటి వారికి ప్రత్యామ్నాయ ఉపాధి కల్పిస్తామని స్పష్టం చేశారు. అలాగే నాటుసారాకు అవసరమైన బెల్లం ఊటలను విక్రయించేవారిలో 58 మందిని గుర్తించామని వారిలో 22 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు ఏసీ రామచంద్రరావు తెలిపారు. జిల్లాలో ఇప్పటి వరకు 838 బెల్టు దుకాణాలపై చర్యలు తీసుకున్నామని, వాటిలో భాగంగా 1314 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. పలాసలో అధిక ధరలకు మద్యం అమ్మకాలు చేసిన దుకాణంపై రూ.5 లక్షల జరిమానా విధించినట్లు తెలిపారు.

నాటు సారా అమ్మకాలు, అధిక ధరలకు మద్యం అమ్మకాలు, ఒడిశా నుంచి అక్రమంగా మద్యం తరలింపు, బెల్టు దుకాణాలు నిర్వహిస్తే తక్షణమే 14405 టోల్‌ఫ్రీ నంబరుకు గాని, 94409 02332 ఫోన్ నంబరుకు సమాచారం అందజేయాలని కోరారు. ఆయనతో పాటు టెక్కలి ఎక్సైజ్ సీఐ షేక్ మీరా సాహెబ్, సిబ్బంది ఉన్నారు.



టెక్కలి ఎక్సైజ్ కార్యాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏసీ రామచంద్రరావు

అక్రమంగా గ్రావెల్ తరలింపు



గ్రావెల్ అక్రమంగా తరలించిన కొండ అంచు భాగం

సారవకోట: మండలంలోని జమచక్రం గ్రామం నుంచి సత్రాం పంచాయతీ గొల్లపేట వెళ్లే మార్గంలో సర్వే నంబర్ 42 కొండ నుంచి అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్నారు. ఈ మార్గంలో కొత్తగా రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఈ పనులకు వినియోగించుకునేందుకు సంబంధిత కాంట్రాక్టర్లు పక్కనే ఉన్న కొండ నుంచి గ్రావెల్‌ను ఎలాంటి అనుమతులు లేకుండా తరలించుకుంటున్నారు. ప్రస్తుతం అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్న కొండ నుంచి సచివాలయం కూత వేటులోనే ఉన్నా సంబంధిత రెవెన్యూ సిబ్బంది చూసీ చూడనట్లు వ్యవహరించడం విచారకరం. దీనిపై స్థానిక వీఆర్వో రామును వివరణ కోరగా పరిశీలించి చర్యలు తీసుకుంటానని చెప్పారు.

పరిమితి పెరిగిందోచ్

- 10 నుంచి 20 శాతం పెరిగిన స్కేల్ ఆఫ్ ఫైనాన్స్
- వరికి రూ. 52 వేలు వరకు రుణానికి అవకాశం
- మొక్కజొన్నకు రూ.47 వేలు
- వేరు శనగకు రూ.41 వేలు
- బ్యాంకుల్లో ప్రారంభమైన పంటరుణాల రెన్యువల్స్



వరి పంట

నరసన్నపేట: ఖరీఫ్, రబీల్లో పంటల వారీగా రైతులకు ఎంత మొత్తంలో రుణాలివ్వాలనే అంశంపై గరిష్ట రుణ పరిమితి (స్కేల్‌ఆఫ్ ఫైనాన్స్) ఖరారైంది. గత ఏడాది కంటే ఈ ఏడాది అన్ని పంటలకు రుణ పరిమితి 10 నుంచి 20 శాతం వరకు పెరిగింది. ఏటా వ్యవసాయ పెట్టుబడులు పెరుగుతుండటంతో బ్యాంకు రుణాల పరిమితిని కూడా పెంచుతున్నారు. దీంట్లో భాగంగా రానున్న ఖరీఫ్, రబీ సీజన్‌లకు గరిష్ట రుణపరిమితి నిర్ణయించారు. ఈ మేరకు బ్యాంకులకు ఆదేశాలు వచ్చాయి. దీంతో బ్యాంకుల్లో కొత్త రుణాల పంపిణీ, పాత రుణాలు రెన్యువల్స్‌ను బ్యాంకర్లు ప్రారంభించారు.

పంటల వారీగా రుణపరిమితి ఇలా..

వర్షాధారం, నీటి వసతి కింద ఉన్న పొలాలకు వేర్వేరుగా పరిమితిని నిర్ధారించారు. వరికి గత సంవత్సరంలో ఎకరాకు రూ.46 వేలు రుణం ఇవ్వగా, దీన్ని ఈ ఖరీఫ్‌కు రూ.52వేలు చేశారు. రబీలో అయితే రూ.55 వేలు, విత్తన వరికి అయితే రూ.55 వేలు ఇవ్వనున్నారు. అలాగే వేరు శనగకు వర్షాధారం అయితే ఎకరాకు రూ.38 వేలు, కాలువ కింద పొలాలు అయితే రూ.41 వేలు, పత్తికి రూ.51 వేలు, మొక్క జొన్నకు రూ.47 వేలు, మినుము పంటకు రూ.30 వేలు, పెసలకు రూ.24వేలు, ఆయిల్ పామ్‌కు రూ. 70 వేలు, పచ్చి మిరపకు రూ.1.10 లక్షలు, రెడ్ మిరపకు రూ. 1.75 లక్షలు, చెరుకుకు రూ.80 వేలు, హైబ్రీడ్ టమాటాకు రూ.78 వేలు, వంకాయకు రూ.54 వేలు, బెండకు రూ.36 వేలు, అరటి ఎకరాకు రూ.1.10 లక్షలు, కొబ్బరికి రూ.70 వేలు, గడ్డి సాగుకు రూ.36 వేలు, బంతి పూల సాగుకు రూ.55 వేలు, వాటర్ మిలన్‌కు రూ.54 వేలు ఇలా మొత్తం 110 పంటలకు రుణ పరిమితిని నిర్ధారించారు. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

బ్యాంకర్లకు సమాచారం ఇచ్చాం



పెరిగిన రుణపరిమితి వివరాలపై బ్యాంకులకు సమాచారం ఇచ్చాం. దీని ప్రకారం బ్యాంకర్లు రుణాలు రెన్యువల్ చేయడం, కొత్తవి ప్రాసెస్ చేయడం ప్రారంభించారు. ఈ ఏడాది మరింత విరివిగా బ్యాంకుల ద్వారా రుణాలు ఇవ్వనున్నాం.

– సూర్యకిరణ్, ఎల్‌డీఎం

‘కంచె’పట్టు చీరల మధ్యన..

పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని 02వ వార్డు నెమలినారాయణపురం గ్రామంలో చీమ బంతి మొక్కలు పెంచుతున్నారు. ఈ తోటకు రక్షణగా పాత చీరలను రైతులు కట్టారు. చూపరులను ఈ దృశ్యాలు ఆకట్టుకుంటున్నాయి. – కాశీబుగ్గ



నిర్మానుష్యంగా రోడ్లు



మధ్యాహ్నం నిర్మానుష్యంగా ఉన్న పాలకొండ–శ్రీకాకుళం ప్రధాన రహదారి

బూర్జ: ఎండ వేడిమికి మండలంలో గల ప్రధాన రహదారి పాలకొండ– శ్రీకాకుళం రోడ్డు నిర్మానుష్యంగా మారింది. ప్రధాన రహదారితో పాటు బూర్జ –మామిడివలస, కొల్లివలస –నారాయణపురం లింకు రోడ్లు నిర్మానుష్యంగా మారాయి. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకు ప్రయాణం చేయాలంటే నరక యాతన పడుతున్నారు.

రాగుల సేకరణకు సిద్ధం



జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్

శ్రీకాకుళం పాత బస్టాండ్: జిల్లాలో రాగుల సేకరణకు ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. ఇప్పటికే వ్యవసాయ శాఖ ద్వారా ఈ పంటకు సంబంధించిన కేవైసీ పూర్తిచేసిన రైతుల నుంచి రాగులను సేకరించేందుకు తగిన ఏర్పాట్లు చేసినట్లు జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ తెలిపారు. సంతబొమ్మాళి మండలం రైతు సేవా కేంద్రం వద్ద రాగుల సేకరణ కేంద్రాన్ని ప్రారంభించాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. రాగులు పండించిన ఇతర మండలాల్లో క్లస్టర్ పద్ధతిలో రైతులకు మరింత చేరువలో రాగుల సేకరణ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నామని చెప్పారు. ప్రభుత్వం నిర్ధారించిన మద్దతు ధర క్వింటాల్‌కు రూ.4,290గా ఉంటుందని తెలిపారు. గోనెసంచులు, కూలీ ఖర్చులను ప్రభుత్వం భరించనుందని పేర్కొన్నారు. ధాన్యం సేకరణ తరహాలోనే, రైతు సేవా కేంద్రాల ద్వారా రాగులను సేకరించి, రైతుల ఖాతాల్లో నేరుగా డబ్బులు జమ చేయనున్నట్లు వెల్లడించారు. రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని మద్దతు ధరకు తమ ఉత్పత్తిని ప్రభుత్వానికి అమ్మాలని ఆయన విజ్ఞప్తి చేశారు. మరిన్ని వివరాల కోసం రైతులు 7732098637 లేదా 6281839352 నంబర్లను సంప్రదించవచ్చని సూచించారు.

విద్యుత్ స్తంభాల పరిశీలన

సాక్షి ఎఫెక్ట్...

సంతబొమ్మాళి: రొయ్యల చెరువుల కోసం పంట పొలాల్లో వేసిన విద్యుత్ స్తంభాలను విద్యుత్ శాఖ జేఈ శివకుమార్, మండల విద్యుత్ శాఖ ఏఈ శశిభూషణ రావు సోమవారం పరిశీలించారు. పంట పొలాల్లో దౌర్జన్యంగా విద్యుత్ స్తంభాలు అనే శీర్షికన ఆదివారం ‘సాక్షి’ దినపత్రికలో వార్త ప్రచురితం కావడంతో విద్యుత్ శాఖ అధికారులు స్పందించారు. ఆయా రైతులు, రొయ్యల వ్యాపారితో మాట్లాడారు. ఇరు వర్గాల మధ్య అంగీకారం కుదరకపోవడంతో ఆర్డీవో, విద్యుత్ శాఖ ఉన్నతాధికారులకు లిఖితపూర్వకంగా తెలియజేసి వారి ఆదేశాల మేరకు తదుపరి చర్యలు ఉంటాయని విద్యుత్ శాఖ జేఈ శివకుమార్ తెలిపారు.



పంట పొలాల్లో వేసిన విద్యుత్ స్తంభాలను పరిశీలిస్తున్న విద్యుత్ శాఖ అధికారులు

ఒడిశా నుంచి ప్రథమ భాష సాహిత్య పుస్తకాలు

కవిటి: జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ఒడియా మీడియం విద్యార్థులకు అవసరమైన ప్రథమ భాషా పుస్తకాలు ఒడిశా విద్యాశాఖ నుంచి అందుకున్నామని డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్(ఒడియా) దుర్గాప్రసాద్ చౌదరి తెలిపారు. సోమవారం ఈ మేరకు బరంపురంలో అందుకున్నామన్నారు. జిల్లాలో ఒడియా మాధ్యమం చదువుతున్న విద్యార్థులకు రూ.2లక్షల విలువ చేసే 9,10 వ తరగతి సంబంధించి ప్రథమ భాష ఒడియా సాహిత్య సింధు 1270 పుస్తకాలు, సాహిత్య ధారా 1250 పుస్తకాలు, ఒడియా వ్యాకరణం 2520 పుస్తకాలు ఒడిశా ప్రాంతీయ మాధ్యమిక బోర్డు బరంపురం జోన్ జాయింట్ సెక్రటరీ సుభాష్ చంద్ర బెహరా ఉత్తరాంధ్ర ఒడియా డీఐ దుర్గా ప్రసాద్ చౌధురీకి సోమవారం బరంపురం ప్రాంతీయ మాధ్యమిక బోర్డు కార్యాలయంలో అందజేశారు.



ఒడిశా నుంచి అందుకున్న ప్రథమ భాషా ఒడియా పుస్తకాలు

రోడ్డెక్కిన ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్లు



కలెక్టరేట్ వద్ద నిరసన చేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు

- 28 నుంచి సమ్మెకు సిద్ధం

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఎన్నికల ముందు ఇచ్చిన హామీల మేరకు ఉపాధి పథకంలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లకు వేతనం పెంచాలని, వేధింపులు ఆపాలని డిమాండ్ చేస్తూ వారంతా సోమవారం కలెక్టరేట్ వద్ద నిరసన చేపట్టారు. అంతకుముందు జిల్లా వ్యాప్తంగా వచ్చిన ఫీల్డ్ అసిస్టెంట్లు డచ్ భవనం వద్ద సమావేశం నిర్వహించి ధర్నా చేశారు. ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లను సీఎం, డిప్యూటీ సీఎంలు మోసం చేశారని ఆరోపించారు. ఫీల్డ్ అసిస్టెంట్‌లను ఉద్యోగులుగా గుర్తించడం లేదని, 2016 నుంచి ఒక్క రూపాయి కూడా జీతం పెంచలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వేధింపులు పెరిగాయన్నారు. చెప్పిన పనులు చేయకపోతే ఉద్యోగం నుంచి తీసేస్తామని బెదిరిస్తున్నారని ఆరోపించారు. మరో పది రోజుల్లో తమ సమస్యలు పరిష్కరించకపోతే విధులు బహిష్కరిస్తామన్నారు. ఈ నెల 16 నుంచి దశల వారీగా అధికారులకు తమ గోడు వినిపిస్తున్నామని, ఈ నెల 28 నుంచి విధులను పూర్తిగా బహిష్కరించి నిరవధిక సమ్మె చేపడతామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్ల ఉద్యోగ సంక్షేమ సంఘం నాయకులు సత్యనారాయణ, రామకృష్ణారెడ్డి, పి.రామస్వామి, ధర్మారావు, సూర్యచంద్ర, పెద్ద ఎత్తున ఎఫ్‌ఏలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంపై కేసు నమోదు

ఎచ్చెర్ల క్యాంపస్: పొన్నాడ రోడ్డులో ఎదురెదురుగా వస్తున్న రెండు బైక్‌లు ఆదివారం ఢీ కొన్నాయి. దీంతో ఈ ప్రమాదంలో సోరు శంకరనారాయణ అనే వ్యక్తికి గాయాలయ్యాయి. శ్రీకాకుళం పట్టణానికి చెందిన ఈయన పొన్నాడ నుంచి శ్రీకాకుళం వైపు బైక్‌పై వస్తుండగా ప్రమాదం చోటుచేసుకుంది. దీంతో 108 వాహనంలో శ్రీకాకుళం రిమ్స్‌లో చేర్చారు. క్షత గాత్రుని ఫిర్యాదు, వైద్య నివేదిక ఆధారంగా ఎచ్చెర్ల పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు.

విరిసిన బ్రహ్మకమలాలు



శ్రీకాకుళంలోని పుణ్యపువీధిలో కుప్పిలి అనురాధా, రమేష్ దంపతుల ఇంటి వద్ద బ్రహ్మకమలాలు విరబూశాయి. వారి ఇంటి వద్ద సుమారుగా ఒకేసారు 70 బ్రహ్మ కమలాలు పూచాయి. ఈ నెలలో కేవలం రాత్రి సమయంలో మాత్రమే ఈ బ్రహ్మకమలాలు పూస్తాయి. – శ్రీకాకుళం కల్చరల్